# రామలక్ష్మి

సాయంకాల మయిదుగంటలయినది. ఎండ చల్లబడెను. శీతల ప్రచారము చాల మందముగ నుండెను. మేడల నీడలు చాలదూరమువఱకును ప్రాకిపోయినవి. సర్కారులో కొలువున్న వారందఱును ఇండ్లకు చేరుకొనుచుండిరి. తురకపిల్లలు కొందఱు ఇంటింటికిని తిరిగి మల్లెపూవులును, చేమంతిపూవులును అమ్ముచుండిరి.

చాల మనోహరముగా నున్న యీసమయమున బ్యాండుయొక్క మనోహరగమకములు పెండ్లివారికిముందు వియ్యాలవారి నడకలు చూపుచుండగా ఈ మేడవసారాలోనికి వితంతుయువతియు, ఆ మేడవసారాలోనికి తరుణ విద్యార్థియు నొక్కమాఱే వచ్చిరి. వెంటనే ఇరువుర చూపులు నేకమయినవి. ఇరువుర ముఖములును దరహాసభాసురములైనవి. ఇద్దరి కపోలములును పులకితములైనవి. ఇద్దరి నయనములును లజ్జాముద్రితములయినవి.

ఇంతే. ఇంతే కనబడినవి. వెంటనే యిరువురును లోపలకు బోయిరి. ఎందులకు వచ్చిరో, ఏల నవ్వుకొనిరో, ఎందులకు సిగ్గుపడిరో, ఏల వెడలిపోయిరో.

ఫర్లాంగు దూరమున జనులు గుంపు కనబడినది. మున్ముందు బ్యాండు మనోహర స్వరములు నీనుచుండెను. తరువాత గుఱ్ఱపుబండ్లు రెండు ప్రక్కలను వినోదము చూచుచుండు కూలి స్త్రీలు, పిల్లలు, రాకపోకలు సేయుచుండు మఱికొందఱు నుండిరి. దిదృక్ష ఉఱకలు వేయునంతమందముగ ఆ సమూహము వచ్చుచుండెను.

కొన్ని నిమిషములకు సమూహము సమీపించినది. ముందు బండిమీద నొక యువకుడు నొక యువతియు కూర్చుండియుండిరి. వారి ముఖముల మీద లజ్జామిళిత మగు ఆనందమును, వినయావకుంఠితమగు గర్వస్ఫూర్తియు, ప్రణయోజ్జీవిత మగు నూత్న చైతన్యమును ప్రస్ఫుట మగుచుండెను. వారు నూత్న వస్త్రములను ధరించియుండిరి. మెడలలో పూలదండలుండెను. చేతులలో పూగుత్తులుండెను.

విద్యార్థి మఱల వసారాలోనికి వచ్చెను: గాని యువతి రాలేదు. అయితే ఆమె క్రింద అరుగుమీద నిలిచియుండెను. ముందున్న ప్రౌఢాంగన యొక్క భుజములమీద చేతుల నానుకొని వీలయినపుడు - సిగ్గు సెలవిచ్చినపుడు పైకిచూచుచు ఉత్సవమును జూచుచుండెను.

ముఖము చూపిన పెండ్లివారు వెన్నిచ్చిరి. సమూహము సందు మళ్ళెను. వీధిలో నిలిచియున్న అందఱును ఆశ్చర్యద్యోతకమగు మందహాసము

గావించుచుండిరి. "కాకినాడ కోమట్లలో ఇదే మొదటి వితంతు వివాహం. తల్లిదండ్రులదయవల్ల పెండ్లికూతురికి నవజీవం సంభవించినది. ఉదయము యెనిమిదిగంటలకు పెళ్ళి అయింది. ఊరేగుతున్నారు" అని యొక యువకుడు చెప్పెను.

అవలంబ మిచ్చిన స్త్రీతోగూడ యువతి లోపలకు వెడలిపోయినది. విద్యార్థి తన దృష్టులను ఎదుటి మేడవసారాలోనికి బఱపెను. చూడగాకిటికీ యూచల కావల యువతిముఖము కనబడియెను. ఆ మొఖమున మందహాసము ఇంకను తరుగలేదు.

"ఏమిటిదీ?" హృదయమిట్లు ప్రశ్నించెను; గాని యువకునకేమియు బోధపడలేదు. మఱల నొకమాఱు చూడగా ముఖము కాన్పింపలేదు. విద్యార్థి లోపలకు బోయెను.

సూర్యారావు - తరుణ విద్యార్థి మఱల ఆమెను కండ్లార జూచుటకు రెండుదినములు ప్రయత్నించెను. మెఱపువలె మెరయుటతప్ప రామలక్ష్మి ఆతని యెదుట నిలువలేదు. ఆమె ఎన్నిసారులో వసారాలోనికి వచ్చి ఎన్నిసారులో గిరుక్కున మఱలిపోయినది. సూర్యారావు నెదుట బడుటకు ఆమెకు చాల సంకోచముగానుండెను.

ఇరువురు నొకరి కొకరు క్రొత్తవారు కారు. సూర్యారావు ఆమేడలో రెండేండ్లనుండి యుండెను. కళాశాలలో నాతడు యఫ్యే పరీక్షకు చదువుచుండెను. ఈ రెండేండ్లలో నాతడును, ఆమెయు ఎన్నో మాఱులు ఇతరేతరాభిముఖముగ నిలిచియుండిరి. ఆమె యన్న నిమిత్తము సూర్యారావు ఇంటికి వచ్చినపుడు ఉన్నాడనియో లేదనియో ఎన్నో మాఱులామె ప్రత్యుత్తరము ఇచ్చియుండెను. చాలసారులు వచ్చిన తరువాత ఆతడు చెప్పుమనిన మాటలకు గూడ ప్రత్యుత్తర మిచ్చి యుండెను. ఇప్పుడీ క్రొత్తయేమిటీ?

సూర్యారావునకు కారణము తోచలేదు. యువతుల చిత్తవృత్తుల నెఱుంగుటకు దురదృష్టవశమున ఆతడింకను గృహస్థుడై యుండలేదు. ఇంటివద్ద ఆతనికి పెండ్లిబేరములు జరుగుచుండెను. ఈరూపమున వినిర్మలహృదయఫలకమున ప్రణయ కాంతులు మందమందముగ ప్రాలుటవలన రామలక్ష్మి ప్రవృత్తిలోనేదో విశేషమున్నదని మాత్ర మాతడు గ్రహింపగలిగెను.

పదునెన్మి దేండ్లవయస్సున ప్రణయ ప్రసారము కాకుండుటలో అస్వాభావికత లేదు; గాని ఈ కాలము అంత మంచిదై యుండలేదు. అయితే సూర్యారావు తల్లి "మా అబ్బాయి సత్యకాలపుమనిషి" అని చెప్పుచుండును. ఒక్క కొడుకు. నలుగురు కూతుళ్ళ తరువాత గారాలకూచి. ఆమె తన యన్న కూతురు నాతనికి నిశ్చయము చేయదలచుచుండెను. వరదక్షిణలో వ్యత్యాసముండెను. "నీకొడుకు వేయిరూపాయల కంటె ఎక్కువ చేయదు" అని అన్న చెప్పుచుండగా,

'రెండువేల రెండునూర్లు, రెండు పదార్లకు తక్కువ పనికిరా' దని యామె చెప్పుచుండెను. సూర్యారావు తండ్రి రామచంద్రపురమున ఏబదివేల నగదు గలవాడును ఆతని మేనమామ రాజమహేంద్రవరమున నెలకు రెండువేలు సంపాదించు ప్లీడరునై యుండిరి.

'సంక్రాంతి సెలవులలో వచ్చుచున్నాను. మాఘమాసమున మా అమ్మాయికి పెళ్ళి చేయక తప్పదు. మీరేదో యభిప్రాయము స్థిరపఱుచుకొనియుండవలెను' అని తన బావమఱది వ్రాయగా వేంకటావధానులు 'పండుగ సెలవులిచ్చిన వెంటనే రావలసిన'దని సూర్యారావునకు వ్రాసెను. మేనమామ కూతురు ముఖమును తలచికొనియు పెండ్లిముచ్చటలను భావించుకొనియు ముచ్చటలలో మునిగి తేలుచున్న సూర్యారావునకు ఆయుత్తరము ఆనందమును గలిగింపజాలకపోయినది. "రామలక్ష్మి భావమేమి?" ఇదియే ఆతనికి ఉపాస్యమంత్రమయినది.

రాత్రి యెనిమిది గంటలవేళ దీపము వెలుగున ఆతడు మేడవసారాలో పెట్టె సద్దుకొనుచుండగా రామలక్ష్మి ఆతనిమీదికొక పూలబంతిని విసరిపాఱిపోయెను. సూర్యారావు మీదబడవలసిన బంతి విధివశమున గదిలో గూర్చుండి చదువుకొనుచున్న రంగారావు ఒడిలో బడియెను. "ఏమిటిదీ" అని యాతడు ఉలికిపడి చూడగా బంతిపూవులబంతి కొక చీటి కట్టబడియుండెను. అది చూచి ప్రౌఢుడగుటచే నాతడు తొందరపడక మెల్లగ విప్పి చూడగా "మీరు సంకురాత్రిపండుక్కి యింటికి వెళ్ళకండి" అని అందు వ్రాయబడియుండెను. రంగారావు సంగతియంతయు నూహించుకొని వెంటనే "తప్పదు. నా స్థానమున నామిత్రుడు రంగారావు సకలమును మాట్లాడును" అని ప్రత్యుత్తరము వ్రాసి బంతికి కట్టి సూర్యారావు ప్రక్కమీద వ్రాలిన తరువాత వసారాలోనికి వచ్చి ఆమె ప్రత్యుత్తరము నిమిత్తము ఎదురుచూచుచు స్తంభముచాటున నిలిచియుండుట చూచి తాను చీకటిచాటున నిలిచి బంతిని విసరివేసి లోపలకి పోయెను.

మఱునాడు అరుణోదయ సమయమున సూర్యారావు మోటారుమీద ద్రాక్షారామము మీదుగా రామచంద్రపురము వెడలిపోయెను.

## ②

సూర్యారావును, రంగారావును మూడేండ్ల నుండి సహాధ్యాయులు. సహవాసులు. వారికి భోజనముగూడ వొక్కచోటనే. సూర్యారావు మేధావి. రంగారావు కల్పకుడు. ఈతని మేధకు సారళ్యమును అతని కల్పనకు కౌటిల్యమును భూషణములై యుండెను. ఇరువురును బంధువులు కారు. ఒక్క యూరివారు

కారు. ఒక్క జిల్లావారైన గారు. ఒక్క శాఖ గూడ గాదు. అయినను వారి సహవాసము జరిగిపోవుచుండెను.

రంగారావు స్వయముగ అంగీకరించి పెండ్లియాడిన భార్యనువిడిచి పునర్వివాహప్రయత్నములలో నుండెను. కాకినాడలో ఈసంగతి సూర్యారావునకు తప్ప యితరులకు తెలియదు. స్నేహితుని సలహా చొప్పున అతడు అందరాని కన్యలమీది ఆశను త్రెంచుకొని వితంతువును పెండ్లియాడదలచి వీరేశలింగముపంతులు గారితో ఉత్తర ప్రత్యుత్తరములను జరుపుచుండెను. రూపతృష్ణ అధికమై యుండుట వలన ఆతనికి పంతులుగారు ఇంతవఱకును వివాహము చేయలేకపోయిరి. అనేక పర్యాయము లాతడు పంతులుగారి ఆశ్రమమునకు వెళ్ళి ఎందఱినో వితంతువులను జూచి "ఇంతకంటే అందగత్తె వచ్చినప్పుడు తెలపండి. తొందరలేదు; గాని, సాధ్యమైనంత తొరగా పెళ్ళి కావాలి." అని చెప్పెను. పంతులుగారు రంగారావు మోసగాడాయని తలచునంతగా విసిగిపోయిరి; గాని పూర్వాచారపరాయణుని పుత్రునకు వితంతువావాహము చేసితీరవలెనను పట్టుదల వలన ఆవిసుపును జయించివేయుచుండిరి. తన మొదటి భార్య రంగూను లేచిపోయినదని యాతడు వారికి నచ్చజెప్పెను.

రామలక్ష్మి యేడెనిమిది సారులు రంగారావు మీదికి బంతులు విసరెను. ఒక బంతిలో నున్న జాబులో "ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను" అని యుండెను. రెండవదానిలో "పెళ్ళిచేసుకోవాలి. తెలిసిందా? మఱియొక విధంగా అయితే - అయితే -రాను. తెలిసిందా?" అని యుండెను. మూడవ దానిలో "తొరగా కావాలి" అనియుండెను. నాల్గవ దానిలో "మొగవేషంతో వూరు దాటుతాను. సిద్ధం చెయ్యండి" అనియుండెను. అయిదవదానిలో "రేపు మా అన్నయ్య బందరు వెడతాడు. తెల్లారగట్ల బయలుదేరితే మంచిది" అని యుండెను. ఆ రాత్రి మూడు సారులు బంతులు రాకపోకలు చేసెను.

"వీరేశలింగము పంతులుగారు కలకత్తా వెళ్ళినట్లును, అక్కడ గొప్ప సంఘసంస్కరణ సభ జరుగనున్నట్లును, తొంబదితొమ్మండుగురు వితంతువులు ఆసభాసమక్షమున పెండ్లియాడుటకు తగినయేర్పాట్లు జరిగినట్లును, అందు తమ వివాహము నూరవదిగా జరిగిన చాల శోభగా నుండునట్లును, పంతులుగారు ఈ సంగతి వ్రాసి అక్కడ జరిగించుకోవలసినదని చాల ప్రోత్సహించినట్లును, రంగారావు నిన్ను కలకత్తా చేర్చుననియు, తానక్కడ కలిసికొనెదననియు, ముందు వెళ్ళి అన్నియు సిద్ధము చేసి యుంచెదననియు - ఇట్లు రంగారావు సూర్యారావు తనకు జాబువ్రాసినట్లు రామలక్ష్మిని నమ్మించి ఆమె చెప్పిన చొప్పున అంతయు సిద్ధము చేసి సంకేతానుసారముగ వేకువజామున జట్కాబండిమీద పిఠాపురమునకును అక్కడినుండి అంచెలమీద తునికిని తీసికొనిపోయి అక్కడ రైలెక్కించి కలకత్తా చేర్చెను.

# 3

రంగారావు సాధ్యమైనంత జాగ్రత్తగా పరిశీలించి కలకత్తాలో ఆంధ్రులు లేని స్థలమున తమబస యేర్పఱిచెను. అతడు కోరికొనినట్లు బ్రహ్మసామాజికులున్న యిల్లే బసదొరికెను. అతడు ఇంగ్లీషులో నేదో చెప్పగా యజమానుని యాజ్ఞ చొప్పున ఇంటి స్త్రీలు ఆమెను చాల అదరింపసాగిరి. రామలక్ష్మి స్వయముగ వండి రంగారావునకు పెట్టి రాత్రింబగళ్ళు ఇంటివారి కొమార్త వద్ద కూర్చుండి అల్లికపనులు నేర్చుకొనుచు కాలముగడుపజొచ్చెను. రంగారావు ఆమెకు రెండుదినములలో పుణ్యస్త్రీ వేషమును పూర్తి చేసెను.

నాల్గుదినములు గడచిపోయినవి. సూర్యారావు రాలేదు. జాబు అయినను రాలేదు. ఒకరాత్రి రంగారావు భోజనము చేయుచుండగా తలుపుచాటున నిలిచి రామలక్ష్మి "వారింకా వచ్చారు కారేమండీ?" అని యడిగెను. "కారణం తెలవదు. రేపు తంతి కొడతాను" అని యాతడు చెప్పగా నామె "సభ యెప్పుడండీ?" అనియెను. "నాకు తెలవదు. ఆవివరం మొదట ఆతడు రాయలేదు. వీరేశలింగం గారి బసయినా తెలిస్తే వెళ్ళి మాట్లాడివుందును" అని చెప్పెను. దానిమీద నామె చాలసేపు నిరుత్తరయై యుండి "రేపు తప్పకుండా తంతి కొట్టాలి సుమండీ" యని ఉద్విగ్న స్వరముతో చెప్పెను.

తంతి చేరి జవాబు రావలసిన అవధి దాటగా "మళ్ళీ తంతికొట్టండి" అని యామె చెప్పెను. అతడు "కొట్టే వచ్చాను. ఇక వీరేశలింగంగారి బస కనుక్కుంటాను" అని బయలుదేరి పోయిన రెండుగంటలకు తంతివచ్చెను. రామలక్ష్మి దానిని ప్రాణప్రదముగా దాచికొని యువ్విళ్ళూరుచుండగా రంగారావు వచ్చెను. ఎంతో బడలిన వానివలె నిట్టూర్పులు పుచ్చుచు నాతడు కూర్చుండగా తలుపుచాటున నిలిచి ముసిముసి నగవులతో "జవాబు వచ్చిందండీ" యని యామె తంతి నాతని మీదికి విసరెను. "వచ్చిందా?"అని యాతడత్యానందముతో దానినందుకొని "శ్రమ సఫలమైంది" అని చెప్పుచు దానిని తెఱచెను. అమృతవాక్కులు వినబడునని రామలక్ష్మి యాశించియుండగా రంగారావు ముఖముమీది మహానందము తిరోహితము కాజొచ్చెను. "ఏమిటిదీ?" అని యామె తెల్లవోవుచుండగా "ఛూ: మూర్ఖుడు: మోసంచేశాడు" అనియాతడు తంతిని నేలబెట్టికొట్టెను.

రామలక్ష్మికి నెత్తిమీద మొత్తినట్లయ్యెను. విచారముబికి కన్నులు తిరిగిపోగా నామె కూలబడి యేడ్చుచు "ఏమని రాశారండీ?" అని యడుగగా "ఛండాలుడు. రాయడానికేమి వుందీ? తనకి మేనమామకూతురు తప్పింది గాదుట. క్షమించవలసినదని నీతో చెప్పమన్నాడు. నీయిష్టంవచ్చినవాణ్ని పెళ్ళాడి సుఖించమన్నాడు. నిన్ను తరువాత తాను వచ్చి చూసి దీవిస్తాడుట" అని యాతడు బదులు చెప్పెను. ఆ యేడ్పుతోనే ఆమె "ఆ తంతి యిలా యివ్వండి" అని చేయి

చాపగా "యెందుకూ వెధవతంతీ?" అని యాతడు దానిని ముక్కముక్కలు చేసి లేచి వెడలిపోయెను.

రామలక్ష్మి స్థితి చెప్పజాలనిదిగా నుండెను. తన గతిని తలచికొని యామె వగచి వగచి తుదకు "ఇది నిజమే అయివుంటుందా? సూరీరావు అలా రాస్తాడా? గొంతుకు కోస్తాడా?" అనుకొనుచుండగా రంగారావు మఱల వచ్చి "యేమంటావు మతీ? ఇంటికి తీసుకువెళ్ళమంటే తీసుకెడతాను. ఏంచెయ్యమంటే అది చేస్తాను. – ఆ తుచ్ఛుడి రాతలు నమ్మి నిన్ను యింతదూరం తీసుగువచ్చాను. నామీద నీకు కోపం అక్కర్లేదు. నీయిష్టం ప్రకారం చెయ్యడానికి నాకేమీ అభ్యంతరం లేదు. తొరగా నేను కాకినాడ పోవాలి. చదువు పాడయిపోతూవుంది" అని చెప్పెను. రామలక్ష్మి కొంచెము సేపు ఊరకుండి "మీరు వెళ్ళిపోండి. నేను కాశీపోయి గంగాదేవిని ఆశ్రయిస్తాను" అని చెప్పెను.

ఇరువురును పదినిముసములు ఊరకుండిరి. హఠాత్తుగ రామలక్ష్మి ముఖము పైకెత్తి చూడగా అధోదృష్టులు గల రంగారావు ముఖమున మందహాసమంకితము కాసాగెను. ఉత్తరక్షణమునందే యాతడు ముఖముపైకెత్తి చూపులలో ఆశను తెలుపుచు "లేకుంటే – దయయుంచి – యిల్లు కదిలి రానేవచ్చావు గ–న–క నెత్తిమీద పెట్టుకుని పూజిస్తాను నన్ను పె–ళ్ళా–డు" అనియెను. రామలక్ష్మికి మంగళసూత్రమునకు బదులుగా మెడలో కాలసర్పమును చుట్టినట్లు తోచెను. ఉన్నట్లుండి యామె యేడ్చుచునే క్రోధపరవశయై "ఛండాలుడా, నువ్వు నాకొంపతీశావు" అని మఱల కూలబడి కుమిలి కుమిలి యేడువదొడగెను. రంగారావు భయభ్రాంతుడై అక్కడినుండి వెడలిపోయెను.

## ④

రంగారావు తంతి సంగతి చెప్పగా ఇంటి యజమానుడగు నగేంద్రనాథబెనర్జీ సకరుణముగా రామలక్ష్మి వద్దకు వచ్చి యేమో యడిగెను; గాని భాష తెలియకపోవుటచే నామె కాతని ప్రశ్న తెలియలేదు. శిరముమీద మొత్తుకొనుచు నామె గోలపెట్టుట వలన నాతడు రంగారావు మోసము చేసియుండునని గ్రహించి చూడగా నాతడక్కడ లేడయ్యెను. అతడు తనవెంట రామలక్ష్మి యెదుటకు రాకుండుటకు సందేహించి తానే అతని వద్దకుబోయి తంతి చూపవలసినదని యడుగగా రంగారావు కోపము చేత చింపివేసితి ననియెను. బెనర్జీకి అనుమానము దృఢమయ్యెను. "పోస్టుఆఫీసులో నకలు ఉండును. చూడవచ్చును" అని తలచి బెనర్జీ యాసంగతి చెప్పగా రంగారావు "అలా చెయ్యండి" అని యాతనిని బంపివేసి లోపలకు వచ్చి తన తోలుపెట్టె పుచ్చుకొని వెడలిపోయెను. కోపవశమున రామలక్ష్మి ఆతనినడ్డుకొనజాలకపోయెను. కొంతసేపటికి బెనర్జీ వచ్చి

ఆమెకు తెలియదని యెఱిగియు తంతి కలకత్తాలో పుట్టినదని చెప్పి ఆమె చేసిన సంజ్ఞవలన రంగారావు పాఱిపోయె ననిగ్రహించి సంజ్ఞలతో నామె విచారముడిపి వీథిలోనికి పోయెను.

భవిష్యత్తును గుఱించి యామె యోచించుకొనుచుండగా బెనర్జీ మఱల వచ్చెను. "నీ సంగతి యేమిటమ్మా?" యని బెనర్జీ వెనుకనుండి యొక తెనుగుమాట వినబడియెను. ప్రాణములు లేచివచ్చుటతో సిగ్గును రాగా రామలక్ష్మి తలుపుచాటున నిలిచి క్లుప్తముగా నాతనికి జవాబు చెప్పెను. ఆంధ్రుడనేక ప్రశ్నలడిగెను: గాని రామలక్ష్మి "పేరు సూరీరావుగారు. కాకినాడ కాలేజీలో యెప్పే చదువుతున్నారు. వారికి తంతికొట్టాలి" అని మాత్రమే జవాబు చెప్పెను. ఆంధ్రుడు ఈ సంగతి బెనర్జీకి చెప్పి అతడు కోరగా తన చిరునామా చెప్పి వెడలిపోయెను. బెనర్జీ నిలిచియున్నట్లుగా పోస్టుఆఫీసునకు బోయి వెంటనే రావలసినదని సూర్యారావునకు అర్జెంటుటెలిగ్రాము ఇచ్చివచ్చెను.

## 5

రామలక్ష్మి మనసు కుదుట బడిన దనియే చెప్పవచ్చును; గాని యామెకొక నూత్న సందేహము తోచెను. జరిగిన సంగతిని బట్టి చూడగా మొదటి చీటిగూడ అతడు చూడలేదని యామె కనుమానము కలిగెను. ఈయనుమానము మీద "సూరీరావు పెళ్ళాడతాడా?" అనిమఱియొక పెద్ద సందేహము తోచెను. "పెళ్ళాడకపోతే?" అనియామెను బుద్ధి ప్రశ్నింపగా "గంగాదేవి నాశ్రయించడమే" అని అంతరాత్మ బదులు చెప్పెను. మరల మనసు కుదుటబడియెను.

జాలిపొంది బెనర్జీ భార్యయు, కొమార్తయు రామలక్ష్మిని చాల ఆదరింపసాగిరి; గాని యేమిసుఖము? ఈమెకు గాని వారికి గాని ఒక్కమాటయైన తెలియదు. అంతయు ఏటియావలి గిలిగింతలుగా నుండెను. ఇంటి స్త్రీలు రామలక్ష్మి భావము తమకు తెలిసినదని సంతసించుచుండిరి. వారియింగితము తనకును తెలిసినట్లు రామలక్ష్మి తలంచి యానందించుచుండెను. మాటలు నేర్చియు మాట్లాడుకొనుచుండియు మాట్లాడుకొనుచున్న ఫలము నెఱుగని ఆముగ్గురు స్త్రీలకును గడియలు చమత్కారముగా గడచిపోవజొచ్చెను.

మఱునాడు ప్రొద్దున్న యెనిమిది గంటలకు బెనర్జీ యెక్కడకో పోయెను. అతనికొమార్త చాల ఉత్సాహముతో హాలులో స్వయముగ కుర్చీలు సద్ది కాఫీ తయారుచేయుటకు సర్వమును సిద్ధము చేసికొని యుండెను. ఆమెయు ఆమె తల్లియు గూడ చాల ఉత్సాహము చూపసాగగా రామలక్ష్మి అందులకు గారణము నెఱుంగనేరకయు "సూరీరావుగారు వస్తున్నారేమో"అనుకొనియెను. ఈయూహ తోచిన వెంటనే ఆమెకును ఉత్సాహము వచ్చెను. బంగాళీ భాషలో బెనర్జీకూతురును, తెనుగుభాషలో రామలక్ష్మియు వేళాకోళములాడుకొనజొచ్చిరి.

పదిగంటలయ్యెను. బెనర్జీకూతురు రామలక్ష్మితో మేడయెక్కి మాటిమాటికిని వీధిపొడుగునను చూడసాగెను. ఇట్లు ఒక్క అరగంట చూచి ఆమె కేరింతలు కొట్టుచు చేయిపట్టుకొని రామలక్షిని తనతోగూడ క్రిందికి తీసికొని వచ్చి హాలులో నిలిచెను. ఇంతలోవీథిలో నొకగుఱ్ఱపు బండినిలిచెను. బెనర్జీ బండిదిగి బండివాని కేదో యాజ్ఞాపించుచుండగా సూర్యారావు దిగెను. ఇరువురును లోపలకు వచ్చిరి. వారి ముఖములమీద చిఱునగవు దుముకుచుండెను; గాని సూర్యారావును జూచిన వెంటనే రామలక్ష్మి కూలబడి దు:ఖింపజొచ్చెను. వెంటనే యాతడు ఆమెచెంత గూరుచుండి “విచారించకు. నిన్ను పెళ్ళాడడానికి వచ్చాను” అనియెను.

అందఱు నానందముగ్ధులయిరి. జరిగినదంతయు పూసగ్రుచ్చినట్లు రామలక్ష్మి చెప్పగా సూర్యారావు అది యంతయు ఇంగ్లీషులో బెనర్జీకి - చెప్పెను. బెనర్జీ కూతురు గూడ ఇంగ్లీషు చదివియుండెను. ఆమె తల్లికి జెప్పెను, అందఱును ఆశ్చర్యపడి రామలక్ష్మికి తటస్థించిన చిక్కునకు జాలిపడిరి. బెనర్జీకూతురు క్షణములో కాఫీ తయారుచేసి తెచ్చి ఈయగా సూర్యారావు ఆనందముతో పుచ్చుకొని కృతజ్ఞత దెలిపెను.

## ⑥

నాటిసాయంత్రము కలకత్తాయందలి బ్రహ్మసామాజికుల ప్రధానకార్యస్థానము జనులతో నిండిపోయెను. తెలుగు విద్యార్థులు నూరుమందికి పైగా వచ్చిరి. అనేకమంది బంగాళీ స్త్రీలు వచ్చిరి. పౌరోహిత్యము జరుపుటకు ప్రఖ్యాతిగాంచిన వంగీయవృద్ధుడు ముందు కూర్చుండెను. మంగళవాద్యములు మ్రోగెను. నగేంద్రనాథబెనర్జీ రామలక్ష్మిని తన కూతురుగా భావించుకొని సాదరముగ సూర్యారావున కిచ్చి పెండ్లి చేసెను. దంపతుల మీద కుసుమవృష్టి కురిసెను. సభయంతయు ఆనందధ్వానములు చెలరేగెను.

బెనర్జీ కొంతసేపు బంగాళీలో నేదో చెప్పి సూర్యారావుదెసకు జూచెను. అంతట నాతడు లేచి జరిగిన దంతయు జెప్పగా సభయంతయు రంగారావు దౌర్జన్యమును తెగడి రామలక్ష్మిని పొగడి సూర్యారావును భూషించెను.

నాటిరాత్రి అక్కడకు వచ్చినవారి కందఱకును ఆంధ్రవిద్యార్థులు చందావేసికొని విందు గావించిరి.

వారము దినములు గడచిన తరువాత సూర్యారావు బెనర్జీవద్ద సెలవుగొని బయలుదేఱెను. బెనర్జీకూతురును, రామలక్ష్మియు నొకరినొకరు విడువలేక కౌగిలించుకొని దు:ఖించి తుదకు ఆదు:ఖాశ్రువులను ఆనందాశ్రువులుగా మార్చుకొని ఒకరివద్ద నొకరు సెలవు పుచ్చుకొనిరి. రామలక్ష్మి బెనర్జీకి అతని భార్యకును సాష్టాంగప్రణామములర్పించి బెనర్జీ కూతురును మఱియొకమాఱు కౌగిలించుకొని

"నీ పెళ్ళికి తప్పకుండావస్తాను" అని సూర్యారావుచే ఇంగ్లీషులో చెప్పించెను. బెనర్జీదంపతులు ఆ దంపతులను ఆశీర్వదించిరి.

ఇంటివారును, కొందఱు ఆంధ్రవిద్యార్థులును రైలు కదలునంత వఱకునుండి జేబురుమాళ్ళు ఎగురవేయుచు నూత్నదంపతులను సాగనంపి వెడలిపోయిరి.

## 7

సామల్‌కోట స్టేషనులో రైలు దిగునప్పటికి సహోధ్యాయులు వచ్చి సూర్యారావును రామలక్ష్మిని చుట్టుకొనిరి. రామలక్ష్మి చాల సిగ్గుపడెను. ఇంతలో ఎదుటకు వచ్చి ప్రిన్సిపలు నిలిచెను. తోడనే సూర్యారావు అతనికి సాష్టాంగనమస్కారములాచరించెను. ఒక విద్యార్థి చెప్పగా రామలక్ష్మియు అట్లే చేసెను. ప్రిన్సిపలు సూర్యారావు నభినందించెను. అందఱును మోటారులలో నెక్కి కాకినాడ బయలుదేరిరి.

బాలాజీచెరువును సమీపించునప్పటికి అనేక విద్యార్థులును, ఉపాధ్యాయులు కొందఱును, నగరము నందలి పెద్దమనుష్యులు కొందఱును బ్యాండుతోడను, బాణసంచాలతోడను, పూలహారములతోడను సిద్ధముగానుండిరి. మోటారులు అక్కడికి వచ్చిన పదినిముసములకు ఊరేగింపు ప్రారంభ మయ్యెను. రాత్రి తొమ్మిదిగంటలవఱకును ఊరేగిరి. ఉత్సవము రామలక్ష్మి అన్న యున్న ఇంటి ముంగిటినుండి గూడ వెడలెను. ప్రిన్సిపలు నూత్న దంపతులను తన యింటికి దీసికొనివెళ్ళెను.

రాత్రి ఒంటిగంట యయ్యెను. "పంతులుగారూ, తలుపు తీయండి" అను కేక విని ప్రిన్సిపలు భీమారావుపంతులు స్వయముగ వచ్చి తలుపు తీసెను. తోడనే ఒక పురుషుడును ఒక స్త్రీయు లోపల ప్రవేశించిరి. "మీప్రియశిష్యుడైన సూర్యారావును పెండ్లాడిన రామలక్ష్మి నాచెల్లెలు. ఈమె నాభార్య. నేటిసాయంత్రము దాకా నాచెల్లెలు సంగతి తెలియక చాలా విచారించాము. వీధివారు ఎఱిగినవారూ అనేకవిధాల నిందించారు. అన్నీ భరించాము. నాచెల్లెలు పునర్వివాహం చేసికొన్నందులకు మాకు మహానందం కలిగింది. కాని సంఘానికి జడిసి దూరంగా వుండిపోవలసివచ్చింది. మీవలె నేను ధైర్యంగా సంఘాన్ని యెదిరించడానికి అవకాశములు లేవు. నా 'చెల్లెలికున్న ధైర్యంగూడ నాకులేకపోవడం నాకు లజ్జాకారణమే; గాని యేం చెయ్యగలనూ? దయయుంచి ఆమెనీ, ఆమె భర్తనీ మాకోమాటు చూపిస్తే చాలు. సంఘానికి జడిసి అర్ధరాత్రి వచ్చాము" అని పురుషుడు చెప్పెను. భీమారావు చాల ఆనందించి సూర్యారావును, రామలక్ష్మిని లేపి సంగతి యంతయు జెప్పి తీసికొనివచ్చెను. రామలక్ష్మి తన అన్నను తన వదినను - వైశ్యదంపతులు ఊరేగినపుడు వీధి యరుగు మీద నిలిచి

చూచినపుడు తనకు అవలంబమిచ్చిన ప్రౌఢాంగనను - చూచుటకు లజ్జించెను; గాని భీమారావు ఆమెకు ధైర్యము చెప్పి నమస్కారము చేయుమనియెను. ముందు సూర్యారావును, తరువాత రామలక్ష్మియు వారికి నమస్కరించిరి. దంపతులు తాము తెచ్చిన నూతనవస్త్రములను వారికిచ్చి ఆశీర్వదించి "ఎప్పుడైన ఇట్లే రహస్యంగా వచ్చి చూసి పోతూ వుంటాము" అని చెప్పి "మేము వచ్చిన సంగతి రహస్యంగా వుంచండి" అని ప్రిన్సిపలును బతిమాలి రామలక్ష్మిని విడువలేక వెడలిపోయిరి.

❀ ❀ ❀